నమస్తే తెలంగాణ
జనగామ
5 | శనివారం 23 డిసెంబర్ 2023 | JANAGAON

నేటి నుంచి కేయూలో జాతీయ సెమినార్

రెండు రోజులపాటు సదస్సు నిర్వహణ

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 22: కాకతీయ విశ్వవిద్యాలయంలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో 23, 24 తేదీల్లో జాతీయ సెమినార్ నిర్వహించనున్నారు. సదస్సుకు సంబంధించిన పోస్టర్లను వీసీ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టీ శ్రీనివాసరావు, సెమినార్ డైరెక్టర్ కట్ల రాజేందర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఎస్ నరసింహాచారి, ఫ్యాకల్టీ పీ కృష్ణమాచారి, ఒప్పంద అధ్యాపకుడు ఫణీంద్ర, సహాయ రిజిస్ట్రార్ పృథ్వీరాజ్ వల్లాల పాల్గొన్నారు.

ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

కబళించిన మృత్యువు

వేములవాడ రాజరాజేశ్వరస్వామి సన్నిధానంలో ఏటా మూడు రోజులపాటు గడపడం వారికి సెంటిమెంట్. ఎప్పటిలాగే స్వామివారిని దర్శించుకునేందుకు గురువారం సాయంత్రం కారులో సంతోషంగా బయలుదేరిన వారిని రోడ్డు ప్రమాదం కబళించింది. దీంతో రెండు కుటుంబాల్లో పెనువిషాదాన్ని నింపింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం పెంచికల పేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారులో ఉన్న ఏడుగురిలో నలుగురు అక్కడికక్కడే, ఒకరు దవాఖానలో మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. మృతులంతా ములుగు జిల్లా ఏటూరునాగారం వాసులుకాగా, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఒకే కుటుంబానికి చెందిన మంతెన కాంతయ్య, రేణుక, చందన(ఫైల్)

మంతెన శంకర్(ఫైల్)

మంతెన భరత్(ఫైల్)

దైవదర్శనానికి వెళ్తూ.. అనంత లోకాలకు..

రోడ్డు ప్రమాదంలో ఐదుగురి దుర్మరణం

- ఇద్దరికి తీవ్ర గాయాలు.. దవాఖానలో చికిత్స
- ఎదురెదురుగా ఢీ కొన్న కారు, లారీ
- మృతుల్లో భార్యాభర్తలు, కూతురు.. తండ్రి, కొడుకు
- ఎల్కతుర్తి మండలం పెంచికలపేటలో ప్రమాదం
- మృతులంతా ములుగు జిల్లా ఏటూరునాగారం వాసులు
- ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి సీతక్క

ఎల్కతుర్తి/ఏటూరునాగారం, డిసెంబర్ 22: వారంతా అన్నదమ్ముల కుటుంబ సభ్యులు.. వేముల వాడకు వెళ్లి రాజరాజేశ్వరస్వామికి మొక్కులు చెల్లించుకునేందుకు కారులో బయలుదేరారు. కానీ, ఇంతలోనే వారిని మృత్యువు కబళించింది. దైవసన్నిధికి చేరకముందే మార్గ మధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మరొకరు దవాఖానలో మృతి చెందగా, ఇద్దరు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. గురువారం అర్ధరాత్రి సుమారు 2 గంటల ప్రాంతంలో జరిగిన ఈ రోడ్డు ప్రమాదం వారి కుటుంబాల్లో పెనువిషాదాన్ని నింపింది. ఎల్కతుర్తి ఎస్సై రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన మంతెన కాంతయ్య (72), మంతెన శంకర్ (60) వరుసకు అన్నదమ్ములు. కాంతయ్య, అతడి భార్య రేణుక(55), కూతురు చందన (16), మంతెన శంకర్, అతడి భార్య శ్రీదేవి, కుమారులు భార్గవ్, భరత్ (29) ఈ రెండు కుటుంబాలు కలిసి వేములవాడకు కారులో గురువారం సాయంత్రం బయలుదేరాయి. వీరిలో కారు నడుపుతున్న భరత్ అయ్యప్ప మాల ధరించి ఉన్నాడు. సంతోషంగా దైవదర్శనానికి బయలుదేరిన రెండు కుటుంబాలను అర్ధరాత్రి మృత్యువు కబళించింది. సుమారు 2గంటల ప్రాంతంలో ఎల్కతుర్తి మండలంలోని పెంచికలపేట సమీపంలో ఎదురుగా గుజరాత్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరుకు వెళ్తున్న లారీ, కారు ఎదురెదురుగా వేగంగా ఢీకొన్నాయి. కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయి రోడ్డు కింది వైపునకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న భరత్‌తోపాటు అతడి తండ్రి శంకర్, మంతెన కాంతయ్య, అతడి కూతురు చందన తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక సీటులో కూర్చున్న రేణుక, శ్రీదేవి, భార్గవ్ తీవ్ర గాయాలతో కారులోనే ఇరుక్కుపోయారు. విషయం తెలుసుకున్న ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై గోదారి రాజ్‌కుమార్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదాన్ని పరిశీలించారు. కారులో ఇరుక్కున్న క్షతగాత్రులు రేణుక, శ్రీదేవి, భార్గవ్‌ను బయటకు తీసి,108 వాహనంలో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ రేణుక మృతి చెందింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ట్రాక్టర్‌లో ఎంజీఎం మార్చురీకి తీసుకెళ్లారు.

ఘటనా స్థలంలో లారీ

కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్, సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారి రాత్రి ఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. మృతుల బంధువు కట్కూరి విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను ఏటూరునాగారం మండల కేంద్రంలోని వారి ఇంటికి తరలించారు. మృతదేహాలను చూసి గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. శుక్రవారం రాత్రి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, మృతుడు మంతెన కాంతయ్య కమ్మరి పని, అతడి కూతురు చందన ఎనిమిదో తరగతి చదువుతోంది. మృతుడు శంకర్ ప్లాట్ల వ్యాపారం, భరత్ టీఎస్ఎండీసీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత పడడం, మరో ఇద్దరు గాయపడిన ఘటనపై పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమశాఖల మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

ఎంజీఎంలో కరోనా కేసులు



ఇద్దరికి పాజిటివ్‌గా నిర్ధారణ

- ఒకరికి దవాఖానలో చికిత్స, మరొకరికి హోం ఐసొలేషన్
- ఆందోళనలో ఆస్పత్రి ఉద్యోగులు, సిబ్బంది, రోగులు
- భయం లేదంటున్న వైద్యాధికారులు
- పూర్తి సంసిద్ధతతో ఉన్నాం: ఎంజీఎం సూపరింటెండెంట్

వరంగల్ చౌరస్తా, డిసెంబర్22: ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న కరోనా జేఎన్1 వేరియంట్ వరంగల్‌ను తాకింది. డిసెంబర్ 21న కరోనా లక్షణాలతో ఎంజీఎం సారి వార్డులో చేరిన భూపాలపల్లి జిల్లా గణపురానికి చెందిన 62 ఏళ్ల మహిళకు ర్యాపిడ్ టెస్టు నిర్వహించిన వైద్యాధికారులు పాజిటివ్‌గా గుర్తించి మరింత కచ్చితత్వం కోసం మరో ఆరుగురి నమూనాలతో కలిపి కేఎంసీలోని వైరాలజీ ల్యాబ్‌లో ఆర్‌టీపీసీఆర్ టెస్టులకు పంపారు. శుక్రవారం ల్యాబ్ నిపుణులు ఇచ్చిన రిపోర్టు ఆధారంగా మహిళతో పాటు నగరానికి చెందిన మరో వ్యక్తికి కరోనా జేఎన్1 సోకినట్లు వైద్యాధికారులు నిర్ధారించారు. కరోనా సోకిన ఇద్దరిలో వయసు దృష్ట్యా సదరు మహిళను కొవిడ్ వార్డుకు తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యాధికారులు తెలిపారు. నగరానికి చెందిన వ్యక్తిని హోం ఐసొలేషన్‌కు తరలించారు. ఈ సందర్భగా ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్న కరోనా వైరస్ మనిషి ప్రాణాలపై పెద్దగా ప్రభావం చూపదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం ఎంజీఎంలో ర్యాపిడ్ కరోనా టెస్టులు చేస్తున్నామని, అనుమానితులు ఎవరైనా ఉన్నట్లయితే ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చునని తెలిపారు. కరోనా వైరస్ సోకిన వ్యక్తులకు అవసరమైన వైద్యసేవలు, ఔషధాలు అందించడానికి పూర్తి సంసిద్ధతతో ఉన్నామని అన్నారు. ప్రస్తుతం 50 పడకలతో వార్డును కొనసాగిస్తున్నామని, 70 వెంటిలేటర్లు, 200 పడకలు, 10వేల సర్జికల్ మాస్కులు, 5వేల ఎన్95 మాస్కులు, శానిటైజర్, తదితర వైద్య అవసరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అవసరాన్ని బట్టి మరిన్ని సమకూర్చుకోవడానికి అవకాశాలు ఉన్నాయని తెలిపారు.





మాట్లాడుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

ప్రైవేట్ అధ్యాపకులకు సంక్షేమ చట్టం తీసుకురావాలి

మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

హనుమకొండ, డిసెంబర్ 22: ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేసే అధ్యాపకులకు సంక్షేమ చట్టం చేయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌తో కలిసి భవన నిర్మాణ కార్మికులకు ఇన్సూరెన్స్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుడి కుటుంబానికి ఇన్సూరెన్స్ భరోసా ఇస్తుందని అన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు ప్రైవేట్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టామని తెలిపారు. 52 శాతం విద్యార్థులు ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యను అభ్యసిస్తున్నారని, వారికి విద్యను అందిస్తున్న ప్రైవేటు అధ్యాపకులకు సంక్షేమ చట్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందు కోసం పాఠశాలల నిర్వాహకులు ముందుకు రావాలని కోరారు. ఈ చట్టం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమావేశంలో కూడా మాజీ చైర్మన్ సుందర్ రాజుయాదవ్, సీనియర్ నాయకులు మేడిపల్లి శోభన్, మైనార్టీ నాయకుడు నయీం, కార్పొరేటర్ నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకుడు చింతల యాదగిరి పాల్గొన్నారు.

ఎస్సార్‌లో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

హసన్‌పర్తి, డిసెంబర్ 22: ఎస్సార్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో ఐసీఎస్ఎస్ఆర్ ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్సెస్ రిసెర్చ్ ఆర్థిక సహకారంతో రెండు రోజులపాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ప్రోగ్రాం కాన్ఫరెన్స్ కన్వీనర్ డాక్టర్ సుహాసినీరెడ్డి మాట్లాడుతూ 38 పరిశోధక పత్రాలు, కృత్రిమ మేధస్సు.. వ్యాపారంపై దాని ప్రభావం ఎలా ఉంటుంది? అనే అంశంపై ఈ పరిశోధన పత్రాలు సమర్పించినట్లు చెప్పారు. సెయింట్ లూయిస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీధర్ కొండూర్, అనిస్పెటిక్ హెచ్ఆర్ మేనేజర్ రామచందర్, దీప గుప్తా బీర్ల, బిట్స్ పిలానీ ప్రొఫెసర్ డాక్టర్ అనిశ్, రిజిస్ట్రార్ అర్చనారెడ్డి, గోపీనాథ్, గురునాథం, సుశ్రుత్, రమేశ్, మెట్రో డిప్యూటీ జనరల్ మేనేజర్ సుధీర్‌కుమార్, ఎన్ఐటీ ప్రొఫెసర్ రామ్‌లాల్, డీన్ సుమన్ పాల్గొన్నారు.

లక్నేపల్లిలో పుట్టి ప్రధానిగా ఎదిగిన పీవీ నర్సింహారావు బహుముఖ ప్రజ్ఞాశాలి. బహుభాషా కోవిదుడు. దేశ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి. తెలుగు జాతి గౌరవాన్ని చాటిన మహా మేధావి. నేడు పీవీ వర్ధంతి సందర్భంగా ఆయనపై ప్రత్యేక కథనం..

లక్నేపల్లిలో పుట్టి.. ప్రధాని పదవి చేపట్టి

తెలుగు జాతి గౌరవాన్ని చాటిన నర్సింహారావు.. నేడు పీవీ వర్ధంతి

నర్సంపేట రూరల్, డిసెంబర్21: నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలోని అమ్మమ్మ ఇంట్లో 1921జూన్ 28న పీవీ నర్సింహారావు జన్మించారు. ఈయన స్వగ్రామం వంగర. తల్లిదండ్రులు సీతారామారావు, రుక్మిణి. పీవీ ప్రాథమిక విద్య వంగర, హనుమకొండలో సాగింది. 1936లో మెట్రిక్‌లేషన్‌లో ఉత్తీర్ణులయ్యారు. 1938లో నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొనడంతో ఆయన రాష్ట్రంలో ఎక్కడా చదవకుండా, ప్రభుత్వం నిర్బంధం విధించింది. దీంతో ఆయన మహారాష్ట్రలోని పుణెలో బీఎస్సీ, నాగపూర్ విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. ఆయన హైదరాబాద్ ముఖ్యమంత్రిగా పనిచేసిన బూర్గుల రామకృష్ణారావు వద్ద జూనియర్ ప్లీడర్‌గా పనిచేశారు.

రాజకీయ ప్రస్థానం..

పీవీ 1951లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. 1952లో కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా, హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1957 నుంచి 1972 వరకు నాలుగుసార్లు మంథని నియోజకవర్గం(కరీంనగర్) నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. 1967లో బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో వైద్య, ఆరోగ్య, విద్య, దేవాదాయ శాఖలు నిర్వహించారు. 1971 సెప్టెంబర్‌లో ముఖ్యమంత్రిగా పనిచేసి పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. భూసంస్కరణలను కఠినంగా అమలు చేశారు. 1973-75 మధ్య కాలంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగారు. 1977లో హన్మకొండ లోక్‌సభకు ఎన్నికై ఇందిరాగాంధీ మంత్రి వర్గంలో హోం, విదేశాంగ శాఖల మంత్రిగా కొనసాగారు. ఆ తర్వాత రాజీవ్ గాంధీ మంత్రి వర్గంలో హోంశాఖ, మానవ వనరుల శాఖ మంత్రిగా పనిచేశారు. 1991లో దేశ అత్యున్నత ప్రధాని పీఠాన్ని అధిష్ఠించారు. ప్రధానమంత్రిగా ఆర్థిక సంస్కరణలు అమలు చేసి, దేశాన్ని ప్రగతిబాట పట్టించారు. కవి, రచయిత, కథకుడు, అనువాదకుడు, పాత్రికేయుడిగా ఆయన తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు వెలకట్టలేనివి. భూస్వామ్య పోకడలకు దూరంగా తనకు వారసత్వంగా సంక్రమించిన భూమిని పేదలకు పంచారు.

పీవీని విస్మరించిన కాంగ్రెస్ పాలకులు

2004 డిసెంబర్ 23న పీవీ నర్సింహారావు కన్నుమూయగా, ఆయన అంత్యక్రియలకు ప్రాధాన్యమివ్వడంలో అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ సర్కారు పీవీ జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించింది. పీవీ జ్ఞాపకార్థం 2018 జూన్ లో పీవీ మెమోరియల్ ట్రస్ట్ భవనాన్ని ఏర్పాటు చేశారు. లక్నేపల్లిలో నేడు పీవీ వర్ధంతిని ఘనంగా నిర్వహించనున్నారు.